# గ్యారెంటీల అమలుకు పోరాటాలు చేస్తాం..

- సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు
- ఎర్రుపాలెం తహసీల్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

ఎర్రుపాలెం, మార్చి 29 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేసే వరకు ప్రజల తరపున పోరాటాలు చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు హెచ్చరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలతోపాటు ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం ఎర్రుపాలెం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలకు ప్రజలు ఆకర్షితులై ఓట్లు వేసి గెలిపించారని, ఇప్పుడు వారిని మోసం చేయడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. ఉన్న పథకాలను కూడా రద్దు చేస్తూ పేద ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. భవిష్యత్‌లో ప్రజలను సమీకరించి మిలిటెంట్ పోరాటాలు కూడా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య, నాయకులు రామిశెట్టి సురేశ్, అంగోతు వెంకటేశ్వర్లు, సగ్గుర్తి సంజీవరావు, నల్లమోతు హనుమంతరావు, దూదిగం బసవయ్య, గామాసు జోగయ్య తదితరులు పాల్గొన్నారు.


ఎర్రుపాలెం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

# సమాధాన పత్రాలు పదిలమేనా?

- నిర్లక్ష్యంగా తరలిస్తున్న విద్యాశాఖ అధికారులు
- ఆందోళనలో టెన్త్ విద్యార్థులు
- డీఈవో, ఆర్డీవో పరిశీలన.. ఉన్నతాధికారులకు నివేదిక

ఖమ్మం అర్బన్, మార్చి 29 : అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేసి ఎలాంటి పొరపాట్లు, అవకతవకలు, నిర్లక్ష్యానికి తావివ్వొద్దని ఉన్నతాధికారులు చెప్పిన మాటలు గాలికి వదిలేశారు.. విద్యార్థుల భవిష్యత్ తమ చేతుల్లో ఉందని అప్రమత్తంగా ఉండాలనే విజ్ఞత కూడా లేకుండా పదో తరగతి సమాధాన పత్రాల తరలింపులో నిర్లక్ష్యంగా వ్యవహరించారు అధికారులు. ఖమ్మంజిల్లాలో శుక్రవారం చోటుచేసుకున్న ఘటనతో టెన్త్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. అసలు పదో తరగతి సమాధాన పత్రాలు పదిలమేనా? అని కంగారు పడుతున్నారు.


సరిచేసిన జవాబు పత్రాల బండిల్‌ను పరిశీలిస్తున్న డీఈవో, ఆర్డీవో

## కారేపల్లి మోడల్ స్కూల్‌లో..

పదో తరగతి పరీక్షల్లో భాగంగా శుక్రవారం పదో తరగతి పరీక్షలు ముగిశాక సంబంధిత పరీక్ష కేంద్రం అధికారులు సమాధాన పత్రాలను పోస్టల్ అధికారులకు అందజేస్తారు. వాటిని పోస్టల్ సిబ్బంది అవసరమైన చర్యలు తీసుకుని జిల్లా కేంద్రానికి చేర్చాలి. దీనిలో భాగంగా కారేపల్లి మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రానికి సంబంధించిన సమాధాన పత్రాల తరలింపులో కనీస జాగ్రత్తలు తీసుకోలేదు. తపాలాశాఖ సమాధాన పత్రాలు తీసుకున్న అనంతరం తరలించే సమయంలో సమాధాన పత్రాలకు వేసిన ప్యాక్ చినిగిపోయి, బయటికి కనిపిస్తున్నా అలానే తరలించారు. శుక్రవారం ఘటన జరగ్గా శనివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. పోస్టల్‌కి సంబంధించిన బస్తా, ప్యాక్ చినిగిపోయినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకుండానే అలాగే తరలించారు.

## పరిశీలించిన డీఈవో, ఆర్డీవో..

శనివారం ఉదయం పరీక్ష ముగిసిన అనంతరం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు విషయం తెలిసి వెంటనే విచారణకు ఆదేశించారు. డీఈవో సోమశేఖరశర్మ, ఖమ్మం ఆర్డీవో నరసింహారావు రైలు నిలయంలోని ఆర్ఎంఎస్ పాయింట్‌కు వెళ్లి మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రానికి చెందిన సమాధాన పత్రాలను పరిశీలించారు. పరిశీలనలో ప్యాకింగ్ చినిగిపోయిందని, సమాధాన పత్రాలు మాత్రం సురక్షితంగానే ఉన్నాయని కలెక్టర్‌కు నివేదించారు. అనంతరం డీఈవో సోమశేఖరశర్మ జరిగిన సంఘటన తాలూక అంశాన్ని విద్యాశాఖ డైరెక్టర్, జిల్లా పరిశీలకులుగా వచ్చిన అదనపు డైరెక్టర్‌కు రాతపూర్వకంగా తెలిపారు. దీనిపై డీఈవో స్పందిస్తూ భౌతిక, రసాయనశాస్త్ర పరీక్ష జవాబు పత్రాలు సురక్షితంగా ఉన్నాయని తపాలా శాఖాధికారి తెలిపినట్లు, విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.


## ఆందోళనలో విద్యార్థులు..

సమాధాన పత్రాల తరలింపులో నిర్లక్ష్యం పట్ల మీడియాలో వార్తలు చూసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. విద్యాశాఖ అధికారులు సైతం ఉలిక్కిపడ్డారు. వెంటనే అప్రమత్తమయ్యారు. ఇతర జిల్లాల్లో పేపర్లు లీక్‌కావడం, మొదటిరోజే ఇతర సబ్జెక్ట్ ప్రశ్నాపత్రాలు తెరిచిన అంశాలు ఉండటం.. ఖమ్మం జిల్లాలో ఏమి జరగలేదు అనుకుంటున్న తరుణంలో ఈ సంఘటన అప్రమత్తుల్ని చేసింది. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విద్యావేత్తలు కోరుతున్నారు.

# కాంగ్రెస్ వంచన

ప్రజా పంపిణీకి చెందిన చౌకదుకాణాల వ్యవస్థలో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా పనిచేస్తున్న రేషన్ డీలర్లను కాంగ్రెస్ ప్రభుత్వం నయవంచనకు గురిచేసింది. ఏప్రిల్ నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని బాజాలు వాయిస్తూ పేదలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్న రేవంత్‌రెడ్డి సర్కారు.. ఆ సన్న బియ్యం పంపిణీ చేసే రేషన్ డీలర్లను మాత్రం చిన్నచూపు చూస్తోంది. రేషన్ డీలర్లకు కమీషన్‌ను రూ.300కు పెంచుతామని, గౌరవ వేతనం రూ.5 వేలు ఇస్తామని హామీలు ఇచ్చిన కాంగ్రెస్.. ఏకంగా ఎన్నికల మ్యానిఫెస్టోలోనూ ప్రకటనలు చేసింది. కానీ.. వాటిని నమ్మి ఓట్లేసిన రేషన్ డీలర్లను, వారి కుటుంబాలను మాత్రం నట్టేట ముంచింది.

*-రఘునాథపాలెం, మార్చి 29*



- ‘రేషన్ డీలర్ల’కు ‘చేయి’చ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం?
- రూ.300 కమీషన్, రూ.5 వేల గౌరవ వేతనం అంటూ హామీ
- ఏకంగా ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టి ఊరూరా ప్రచారం
- పెంచేది లేదంటూ అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్ తాజా ప్రకటన
- బీఆర్ఎస్ సర్కారు పెంచిన కమీషన్‌ను తామే పెంచినట్లు గొప్పలు
- నమ్మి ఓట్లేస్తే నమ్మకద్రోహం చేసిన కాంగ్రెస్ సర్కారు
- రేవంత్‌రెడ్డి సర్కారు వంచనపై మండిపడుతున్న రేషన్ డీలర్లు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావస్తోంది. కానీ.. తాను ఇచ్చిన హామీలపై కనీస స్పందన కూడా కన్పిచండం లేదు. దీంతో రేషన్ డీలర్లే అనేకమార్లు ఆ హామీలను ప్రభుత్వానికి గుర్తు చేశారు. తమ సమస్యలను సర్కారు దృష్టికి తీసుకెళ్లారు. అయినా, చలనం లేకపోవడంతో ఎమ్మెల్యేలు, మంత్రులకు వినతిపత్రాలు అందించారు. తమ సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తాలని విన్నవించారు. కానీ.. నెలలు గడుస్తున్నా వీరు గళమెత్తింది లేదు. ప్రభుత్వం ప్రకటనలు చేసింది లేదు. హామీల అమలుకు అడుగు వేసింది లేదు. కనీసం సన్న బియ్యం పంపిణీ నాటికైనా స్పందన ఉంటుందేమోనని ఎదురుచూస్తున్న రేషన్ డీలర్లకు మళ్లీ ఆశాభంగమే మిగిలింది. రేషన్ డీలర్లకు కమీషన్ పెంచే ఆలోచనే లేదంటూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో చేసిన ప్రకటనతో సర్కారు మోసం బట్టబయలైంది.

## తాము పెంచినట్లుగా గొప్పలు..

అంతేగాక, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పెంచిన కమీషన్‌పై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అసత్య ప్రకటనలు చేశారు. కమీషన్‌ను గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాలంలోనే పెంచినప్పటికీ.. తమ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే పెంచామంటూ సాక్షాత్తూ శాసనసభలోనే సత్యదూరమైన మాటలు చెప్పారు. చాలీచాలని కమీషన్‌తో ఎంతోకాలంగా దుర్భరమైన జీవితాలను గడుపుతున్న తమను కాంగ్రెస్ సర్కారు మోసం చేయడంపై రేషన్ డీలర్లు మండిపడుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వ పాలనలోనే తమకు న్యాయం జరిగిందని, రూ.90 పైసలుగా ఉన్న కమీషన్‌ను రూ.1.50కు పెంచారని గుర్తు చేసుకున్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చేవరకూ ప్రభుత్వంపై పోరాడేందుకు సిద్ధమవుతున్నట్లు ఖమ్మం జిల్లాకు చెందిన రేషన్ డీలర్ల సంఘాల నేతలు అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచైనా సరే తమ డిమాండ్లను నెరవేర్చుకుంటామంటూ స్పష్టం చేస్తున్నారు.

### కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయాం..



రేషన్ డీలర్లకు కమీషన్ రూ.300 చేస్తామని, గౌరవ వేతనం రూ.5 వేలకు పెంచుతామని, హెల్త్‌కార్డులు అందిస్తామని, ఇతరత్రా సమస్యలు పరిష్కరిస్తామని కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో తమ మ్యానిఫెస్టోలో ప్రకటించింది. కానీ.. ప్రభుత్వం ఏర్పడి 15 నెలలైనా ఆ హామీలను పరిష్కరించలేదు. పైగా డీలర్ల కమీషన్ పెంచే ఆలోచన లేదంటూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో చేసిన ప్రకటనతో కాంగ్రెస్ ప్రభుత్వం తమను మోసం చేసినట్లు స్పష్టమవుతోంది. కాంగ్రెస్‌ను నమ్మి నయవంచనకు గురయ్యాం.

**-మోటమర్రి చంద్రశేఖర్‌రావు, రేషన్ డీలర్ల సంఘం, ఖమ్మం జిల్లా గౌరవాధ్యక్షుడు**

### మంత్రి ఉత్తమ్ ప్రకటన సరైనది కాదు..



ఎన్నికల్లో హామీ ఇచ్చి అసెంబ్లీ సాక్షిగా కమీషన్ పెంచే ఆలోచనే లేదంటూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటన చేయడం సరైనది కాదు. కమీషన్ పెంచేది లేదంటూ అసెంబ్లీ సమావేశాల్లో చెప్పడం మమ్మల్ని ఎంతగానో బాధించింది. కమీషన్ పెంచుతామంటూ ఎన్నికల సమయంలో హామీ ఇవ్వడంతో ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. కానీ.. మోసపోయాం. చాలీచాలని కమీషన్‌తో కుటుంబాలను పోషించుకోలేకపోతున్నాం. కమిషన్ పెంచే వరకు ప్రభుత్వంపై పోరాడుతాం.

**-గోళ్ల మురళి, రేషన్ డీలర్ల సంఘం నాయకుడు, ఖమ్మం**






# దద్దరిల్లిన సరిహద్దు!

- 17 మంది మావోయిస్టులు మృతి, నలుగురు జవాన్లకు గాయాలు
- వివరాలు వెల్లడించిన బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పాటిలింగం
- ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా కేరళపాల్‌లో ఘటన

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మార్చి 29 : దండకారణ్యంలో మళ్లీ తుపాకుల మోత మోగింది. మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య భీకర పోరు సాగింది. నువ్వా.. నేనా అన్నట్లు సాగిన యుద్ధంలో 17 మంది మావోయిస్టులు మృతిచెందగా.. నలుగురు జవాన్లు సైతం గాయపడ్డారు. మృతుల్లో రూ.25 లక్షల రివార్డు ఉన్న పెద్ద క్యాడర్ మావోయిస్టు కూడా ఉన్నాడు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా కేరళపాల్‌లో శనివారం చోటు చేసుకుంది. వివరాలను బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పాటిలింగం మీడియాకు వెల్లడించారు. కేరళపాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడవుల్లో మావోయిస్టులు సమావేశమయ్యారనే విశ్వసనీయ సమాచారం భద్రతా దళాల ఉన్నతాధికారులకు అందింది. దీంతో జిల్లా రిజర్వు గార్డ్స్(డీఆర్‌జీ), సీఆర్‌పీఎఫ్‌కి చెందిన సుమారు 600 మంది సైనిక దళాలు సంయుక్తంగా మావోయిస్టుల కోసం ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఉపంపల్లి అడవుల్లో మావోయిస్టులు తారసపడి జవాన్లపైకి కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన జవాన్లు నలుదిక్కుల నుంచి ఎదురుకాల్పులకు దిగారు. ఇరువర్గాల మధ్య పలుమార్లు ఎదురుకాల్పులు చోటు చేసుకోవడంతో జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే దట్టమైన అటవీ మార్గం ద్వారా పారిపోయారు. కాల్పుల విరమణ తర్వాత జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ఎదురుకాల్పుల్లో మృతిచెందిన 17 మంది మావోయిస్టుల మృతదేహాలతోపాటు రెండు ఏకే-47 గన్‌లు, ఎస్ఎల్ఆర్‌లతోపాటు 12 ఆయుధాలను జవాన్లు స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో 11 మంది మహిళా మావోయిస్టులు, రూ.25 లక్షల రివార్డు ఉన్న స్టేట్ జోనల్ కమిటీ సభ్యుడు జగదీశ్ అలియాస్ భుద్ర ఉన్నట్లు పోలీస్ అధికారులు ధ్రువీకరించారు. డీఆర్‌జీకి చెందిన ముగ్గురు, సీఆర్‌పీఎఫ్‌కి చెందిన ఒక జవాన్ గాయపడ్డారు. గాయపడిన జవాన్లు ప్రమాదం నుంచి బయటపడినట్లు అధికారులు వెల్లడించారు. ఈ నెల 25న బీజాపూర్, నారాయణ్‌పూర్ జిల్లాల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో రూ.25 లక్షల రివార్డు ఉన్న డీకేఎస్‌జడ్ఎం సుధీర్‌తో సహా 30 మంది మావోయిస్టులు మృతిచెందిన విషయం తెలిసిందే. గడిచిన పది రోజుల్లో బస్తర్ రేంజ్ పరిధిలో 49 మంది మావోయిస్టులు భద్రతా దళాలు జరిపిన ఎదురుకాల్పుల్లో మృతిచెందారు. పెద్ద తలలే టార్గెట్‌గా ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో ఆపరేషన్ ‘కగార్’ కొనసాగుతున్నది. వారం రోజుల వ్యవధిలో జరిగిన రెండు భారీ ఎన్‌కౌంటర్లలో ఒక్కొక్కరిపై రూ.25 లక్షల రివార్డు ఉన్న సుధీర్, జగదీశ్‌లు మృతిచెందడమే ఇందుకు ఉదాహరణ. ఇప్పటికే దండకారణ్యాన్ని 60 శాతం భద్రతా దళాలు తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు ప్రస్తుత పరిణామాలనుబట్టి తెలుస్తున్నది. సుక్మా జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో 17 మంది మావోయిస్టులు మృతిచెందగా.. మరికొందరికి బుల్లెట్ గాయాలైనట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పాటిలింగం, సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ ఘటనా స్థలాన్ని సందర్శించి.. పారిపోయిన మావోయిస్టుల కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. ప్రస్తుత ఘటనలో మిగతా మృతుల వివరాల కోసం దర్యాప్తు చేపట్టామని, త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు.











# సింగరేణి ఆస్పత్రిలో విజిలెన్స్ దాడులు

## సీఎంవో, డ్రైవర్ల ఫోన్లు స్వాధీనం చేసుకున్న అధికారులు

కొత్తగూడెం సింగరేణి, మార్చి 29 : సింగరేణి విజిలెన్స్ అధికారులు కొత్తగూడెం కార్పొరేట్ ప్రధాన ఆస్పత్రిలో చీఫ్ మెడికల్ ఆఫీసర్(సీఎంవో)గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సుజాత కార్యాలయంలో శనివారం సాయంత్రం దాడులు చేపట్టారు. డాక్టర్ సుజాత సీఎంవోగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి బోర్డు మెడికల్‌లో వచ్చిన అవినీతి ఆరోపణల నేపథ్యంలో దాడులు జరిగినట్లు తెలుస్తున్నది. సీఎంవోకు సంబంధించిన సెల్‌ఫోన్లు, ఇద్దరు డ్రైవర్ల సెల్ ఫోన్లను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అలాగే వారి బ్యాంకు లావాదేవీలను కూడా పరిశీలించినట్లు తెలిసింది. ఈ నెల 31న ఉద్యోగ విరమణ పొందనున్న సీఎంవోపై రెండు రోజుల ముందు విజిలెన్స్ అధికారులు విచారణ జరపడం, ఆ సమయంలోనే ఆమెకు హెడ్డాఫీస్‌లో వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేయడం, అది ముగిసిన తర్వాత తిరిగి విజిలెన్స్ అధికారులు హెడ్డాఫీస్‌లోని విజిలెన్స్ కార్యాలయానికి తరలించి విచారించినట్లు తెలిసింది. ఆమె బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పలు అవినీతి ఆరోపణలు వచ్చినప్పటికీ ఇప్పుడు విజిలెన్స్ అధికారులు విచారణ చేయడం కంటితుడుపు చర్య అని, వారి వైఫల్యానికి ఇది నిదర్శనమని కార్మికులు, కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఏదేమైనప్పటికీ కార్మికులకు ఉద్యమ సమయంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన కారుణ్య నియామకాల పేరుతో ఇటు డాక్టర్లు, అటు కార్మిక సంఘాల నాయకులు కార్మికుల నుంచి లక్షలాది రూపాయలు దండుకోవడం సరైంది కాదని, వివిధ రుగ్మతలు ఉన్న కార్మికులను మెడికల్ ఇన్వాలిడేషన్ చేసి వారసులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని టీబీజీకేఎస్ డిమాండ్ చేస్తున్నది.


కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆస్పత్రి











# ఐదో రోజుకు చేరిన ఆర్టిజన్ల దీక్షలు


నిరాహార దీక్ష చేస్తున్న నిర్మాణ కార్మికులు

పాల్వంచ, మార్చి 29 : పాల్వంచ కేటీపీఎస్ 6వ దశలో నిర్మాణ కార్మికులుగా పనిచేసిన వారిని ఆర్టిజన్లుగా తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పాల్వంచ కేటీపీఎస్ అంబేద్కర్ సెంటర్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం ఐదవ రోజుకు చేరాయి. దీక్షలను సీఐటీయూ నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు దొడ్డా రవికుమార్ మాట్లాడుతూ 6వ దశ నిర్మాణంలో తమ ప్రాణాలు పణంగా పెట్టి పునాది దగ్గర నుంచి విద్యుత్ ఉత్పత్తి జరిగే వరకు పనిచేసిన కార్మికులను నిర్దాక్షిణ్యంగా బయటకు వెళ్లగొట్టారని, వారందరినీ యాజమాన్యం ఆర్టిజన్లుగా తీసుకోవాలన్నారు. టీజీ జెన్‌కో యాజమాన్యం, ప్రభుత్వం స్పందించి 418 మందిని బేషరతుగా ఆర్టిజన్లుగా తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాతోజు సత్య, జెన్‌కో యూఈఈయూ అధ్యక్షుడు అంకిరెడ్డి నరసింహారావు, నిర్మాణ కార్మికుల నాయకుడు హాతీరాం పాల్గొన్నారు.